

# ఆనితమ్మ

వేదుల
సత్యనారాయణ శాస్త్రి గారు
(సాహితీసమితి)

" ఈభవాంభోధి నీ వేరీతి దాటేవు ఏమి తలపోసేవె ఓమనసా!
కన్నుగానగరాని కటికిచీకటిలోన ఎన్నాళ్లీ నీబ్రదుకు ఓమనసా? "

ఆంధ్రదేశములో ఆబాలగోపాలమూ ఈ కీర్తన పాడుతుంటారు. నే నెన్నోసారులు విన్నాను. ఆకీర్తనంటే నాకు ఇష్టముకూడా. ఈ దూరదేశములో, ఈటంగూనగరములో, ఈ బర్మావాళ్లనడమ, ఈతెలుగుకీర్తన వినబడడము నాకు కర్ణామృతముగా ఉన్నది. ఆస్వరముకూడా ఎక్కడనో విన్నట్లే ఉన్నది. కొంచెముదూరాన వినబడుతుండడమువల్ల నాకు ఆ పాటమీద మరింత ఆసక్తి కలిగింది. ఏవైపు నుంచి ఆపాట వినబడుతున్నదో ఆవైపే ముందుకు పోయాను.

అది భాద్రపదమాసము. సెటాంగునది ఒడ్లొరసి పారుతున్నది. దాని అవతలిగట్టున చెట్లచేమలతో పచ్చగా ఉన్నపర్వతము; ఆ పర్వతమువెనకనే కుంకుతున్నపొద్దు; ఆపొద్దు పక్కపక్కల మంకెనపూల రాసులలాగున చరమసంధ్యారాగ రంజితములైన మబ్బుతునకలదొంతరలు- చూడడానికి ఎంతోమనోహరముగా ఉన్నవి. సందెకావి తగ్గిపోతున్న కొద్ది ఎఱ్ఱనిమబ్బుతునకలన్నీ క్రమక్రమముగా నల్లబడిపోతున్నవి. సిటాంగునదిమీదినుంచి చల్లగాలి వీస్తున్నది.

" అస్తమించెను సూర్యుడంతరించెను సంధ్య
అయిపోయె నీరోజు ఓమనసా!
గట్టుపై కూర్చుండి కంట నీరిడుచున్న
కానరాదే దారి ఓమనసా!"

నాకెంతో ఆశ్చర్యమయింది. సిటాంగు నదిమీద ఒకవంతెన ఉన్నది. టంగూనగరములో ఆవంతెనమీద తిరగడముకన్న నాకు మరొక ఆనందము లేదు. ఆవంతెన మీదనే కూర్చుండి ఒక బౌద్ధసన్యాసి ఏకతారమీద ఆపాట పాడుతున్నాడు. ఉచ్చారణలో ఏమీ

పనలేదు. చక్కని తెలుగుపాట పాడుతున్నాడు. నేను వంతెనమీదికి వెళ్లి నిలబడ్డాను. ఆసన్యాసి నాకేసి కన్నెత్తి చూడనేలేదు.



తదేకదీక్షతో కళ్లు మూసుకొని పాడుకొంటున్నాడు.

"ఇల్లువాకిలిగాని, ఇల్లాలుగాని, నీ
కిపుడు తోడౌనటే ఓమనసా!
కల్లబంధాలెల్ల చల్లగా తెంపుకొని
గతి యేదో చూడవే ఓమనసా!
భవ్యతేజోమూర్తి, భవకర్ణధారి ఆ
పరమేశు డొక్కడే ఓమనసా!
ఆపదలు, గీపదలు అణగునే యికనయిన
అతడె శరణనుకోవె ఓమనసా!"

ఆసన్యాసికి గడ్డాలు మీసాలు లేవు. బోడి తల. కాషాయవస్త్రాలు కట్టుకొన్నాడు. ఈ బర్మాదేశములో, ఈబౌద్ధసన్యాసినోట చక్కని తెలుగుపాట విని నేను నివ్వెరపోయాను. నానోట మాట రాలేదు. కీర్తన అయిపోయింది. కొంచెము సేపటివరకూ కళ్లు మూసుకొని ఏదో యోగసమాధిలో ఉన్నట్లు ఉన్నాడు సన్యాసి. తర్వాత ఏవో మంత్రాలు కాబోలు, నెమ్మదిగా గొణిగాడు. అవి పాలీభాషలో ఉండడము వల్ల నాకేమీ అర్థముకాలేదు. కాని వినడానికి సొంపుగా మాత్రము ఉన్నవి. ఈ తెలుగు పాటా, ఈపాలీమంత్రాలూ, నన్నాసన్యాసికి మరింతదగ్గరగా లాగినవి. అతడు కళ్లు తెరవగానే నేను మరింతదగ్గిరికి వెళ్లి నిలుచున్నాను. నావాలకము చూచి ఆయన నవ్వాడు. నేను నెమ్మదిగా "మీరెప్పుడైనా తెలుగుదేశము వెళ్లారా యేమిటి?" అని అడిగాను.

"అవును, వెళ్లాను. నీ విక్కడికి వచ్చి ఎన్నాళ్లయింది?"

"నేను వచ్చి యిప్పటికప్పుడే ఏడాది వెళ్లింది. ఇక్కడ ప్లీడరీ చేస్తున్నాను. మీరెక్కడా ఉండడము?"

"ఫలానిచోట నివాస మని లేదు. నేను బౌద్ధ భిక్షువును. ఊరికే తిరుగు తుంటాను. దగ్గర ఏమఠ ముంటే దానిలో పడుకుంటాను. 'సత్రేభోజనం, మఠేనిద్రా.' నేనూ తెలుగు వాడనే."

ఆకాశమంతా దట్టమైన మబ్బు గమ్మి ఉన్నది. హఠాత్తుగా ఒక పెద్ద ఉఱుము ఉఱిమింది. నేను ఉలికిపడి పైకి చూచాను. తప్పకుండా వాన వస్తుందని తోచింది. టంగూనగరములో వానలకు విధీ విరామమూ ఉండదు.

వాన కురవడము మొదలు పెట్టితే ఇక వెల వడ మంటూ లేదు.

"మబ్బు దట్టముగా పట్టింది. వాన రాక తప్పదు. మీరు మాయింటికి దయచేయండి" అన్నాను నేను.

"గృహస్థులయింట్లో కాలుబెట్టి చాలా రోజు లయింది. అయినా నీవు తెలుగువాడవు. పద. వస్తాను." అని లేచాడు సన్యాసి. వంతెన దగ్గరనే గుఱ్ఱపు బండిని విడిచిపెట్టి వచ్చాను నేను. వాన ప్రారంభమయింది. కొంచెము తడుస్తూ తడుస్తూనే వంతెన దిగి మేము బండి దగ్గరికి వచ్చి ఎక్కాము. బండి మా యింటి వైపు మళ్లింది.

మాయింట్లో నా 'డ్రాయింగ్ రూము' చక్కగా సర్ది ఉన్నది. పరదాలూ, పటాలూ, బొమ్మలూ, కుర్చీలూ, టేబిలూ, అన్నీ ఏది ఎలా ఉండాలో అలా అమర్చింది నాభార్య. ఆమె నేర్పే ఆగది అంత శుభ్రముగా, అంత చక్కగా, ఉండడానికి కారణము. తళుక్కున మెరుపు మెరిసింది. ఆవెలుతురులో ఆగదిలోని చిన్నా పెద్దా వస్తువులన్నీ చక్కగా ఉన్నట్లు కనబడినవి. లోపలినుంచి ఆగదిలోకి రావడానికి ఒక గుమ్మ మున్నది. ఆగుమ్మము లోనే ప్రాణము గల చిత్రపటము లాగున కదలక మెదలక నాభార్య నిలుచున్నది. ఆ మెరుపు మెరిసినప్పుడు నాభార్య ఎంత చక్కగా కనబడిందో నేను చెప్పలేను. కానీ ఏమిటిది? ముందుగా బండి దిగి గడపలో కాలుబెట్టాడో లేదో ఆసన్యాసి నాభార్యను చూచి, "ఇదేమిటి? ఎవరు?" అని ఒక్క కేక వేసి కింద కూలబడ్డాడు. క్రమక్రమంగా అతనికి తెలివి దప్పిపోతున్నట్లు తోచింది. నాభార్య భయపడుతూ నాపక్కకు వచ్చి నిలుచున్నది. నేను గబగబా వెళ్లి 'స్మెల్లింగుసాల్టు' సీసా తీసుకొని అతని దగ్గరికి వెళ్లి కూర్చున్నాను. ఆసన్యాసి మెల్లగా "అక్కర లేదు. కొంచెమ ముండు. ఏమీ ఫరవా లేదులే" అని లేచి కూర్చొని ఏదో ధ్యానము మొదలు పెట్టాడు. ఆగదిలో బౌద్ధ సన్యాసుల బొమ్మలు చాలా ఉన్నవి. ధ్యానిస్తూ ఉన్నప్పుడు ఈ సన్యాసి కూడా ఒక బొమ్మలాగే ఉన్నాడు. నాభార్యమనసు కొంచెము కుదుటబడింది. ఈసన్యాసి తెలుగువాడేనని నేనప్పుడు ఆమెకు చెప్పాను. ఆమె మెల్లగా నా పక్కనే కుర్చీమీద కూర్చున్నది.

బయట వాన పెద్దదయింది. ఒక తుపానులాగు ఉన్నది వాన. ఏనుగుతొండములావు ధార పడుతున్నది. పెద్ద యీదురుగాలి. నడమ నడమ ఉఱుములూ మెఱుపులూను. సన్యాసి కళ్లు తెరిచాడు. అతని కాళ్లకు వంగి నమస్కరించి, "ఏమి స్వామీ! నామీద తమకు కోప మెందుకు? నేనేమి అపరాధము చేశాను?" అని సవినయముగా అన్నది నాభార్య.

"లేదమ్మా లేదు. నీమీద కోప మేమిటి?" అన్నాడు సన్యాసి నవ్వుతూ.

"కొంచెము తేనీరు తెచ్చి ఇయ్యమంటారా?"

ఈమాట విని సన్యాసి కొంచెము నవ్వుతూ, "సరే! తీసుకొనిరా!" అన్నాడు. స్వయముగా టీ తయారుచేసి తీసుకొని రావడమునకు నాభార్య వెళ్లింది. సన్యాసి నావైపు చూచి "నీభార్య పేరేమిటి?" అని అడిగాడు.

నాకు కొంచెము సిగ్గూ, ఆశ్చర్యమూ కలిగింది. చెప్పక పోవడమేమి? నాభార్యపేరు నేనుచెప్పనా? అయినా ఈకాలములో తప్పులేదని "అనితమ్మ" అని సమాధానము చెప్పాను.

ఆపేరు వినడముతోనే సన్యాసికి పిడుగు పడ్డట్టు అయింది. ఏదో విద్యుత్ప్రవాహము అతని శరీరములో ప్రవహించినట్లయింది. గాలి




కి రావిఆకులాగున అతడు నిలువున చలించిపోయాడు. ఆకంగారూ, ఉద్రేకమూ చూచి నేను బెదరిపోయాను. వెంటనే ఆసన్యాసి కళ్లు మూసుకొని మరల యోగసమాధిలో మునిగిపోయాడు.

కొంచె మేదో చిరుతిండీ, తేనీరూ, తీసుకొని నాభార్య వచ్చింది. సన్యాసి కొంచెముసేపటికి కళ్లుతెరచి చూచాడు. నవ్వుతూ ఒక కుర్చీమీద కూర్చొని అవి పుచ్చుకొన్నాడు. తర్వాత "అబ్బా! ఏమిటీవాన! ఈవేళ ఏదో మూడింది. ఏదో విపరీతానికే భగవంతుడిదంతా కల్పించాడు." అని, కొంచెమాగి, మళ్లా మాకేసి చూచి, "నాసంగతి తెలుసుకోవాలని ఉన్నదా మీకు?" అని అడిగాడు. నేనూ, నాభార్యా ఒకరిమొగము ఒకరు చూచుకొన్నాము. తర్వాత "చిత్తము" అన్నాము.

"అంతా చెప్పడానికి ఇప్పుడు సావకాశము లేదు. టూకీగా చెపుతాను. వినండి. ఇరవయ్యోయేట నేను బి. ఎ. ప్యాసైనాను. ఆయేడే నాభార్య కాపురానికి వచ్చింది. నాభార్య అంటే నాకెంతో ప్రేమ. ఆమెను విడిచిపెట్టి ఒక నిమిషమైనా ఉండలేకపోయేవాణ్ణి. అటువంటప్పుడు పొరుగూళ్లలో చదవడము నాకిష్టము లేకపోయింది. అందుచేత చదువుతున్న 'లా' మానేశాను. ఏదైనా వ్యాపారము చేయాలని బర్మాకు ప్రయాణమైనాను. ఇది చాల రోజుల క్రితముమాట: అయినా ఈవేళ జరుగుతున్నట్లే ఉంది. నేను బయలుదేరి వస్తున్నప్పుడు గుడ్లనీరు గుక్కుకుంటూ చూస్తూ నిలుచున్న నాభార్య యిప్పుడు కళ్లకు గట్టినట్లు

ఉన్నది. అప్పటి సంగతు లన్నీ ఒక్కటొక్క-టే మనసుకు తట్టుతున్నవి.

బర్మా వచ్చాను నేను. కొన్నాళ్లు రంగూనులో వ్యాపారము చేసి కొంతడబ్బు సంపాదించాను. తర్వాత టేకుకఱ్ఱ వ్యాపారము చేయాలని బుద్ధి పుట్టింది. అందుకోసము ఈటంగూనగరము వచ్చాను. అప్పుడు నేను ఈయింట్లోనే కాపురమున్నాను. ఈయింటికి పడమటి వైపున గుఱ్ఱాలసాల ఉన్నది కదూ! అందులోనే నాగుఱ్ఱపుబండీ, రెండు బర్మాగుఱ్ఱాలూ ఉండేవి. ప్రతిరోజూ సాయంకాలము గుఱ్ఱపుబండిమీద సిటాంగునదీతీరానికి షికారువెళ్లడము నాకలవాటు. రోజూ వెళ్లుతుండేవాణ్ణి. నేనెక్కడ గుఱ్ఱపుబండి దిగి నడక సాగించేవాణ్ణో అక్కడనే రోడ్డుపక్కన ఒక ఇల్లున్నది. ఆయింటి వీథివైపు కిటికీలో, నేను బండిదిగే సమయానికి ఏదో అందమైనముఖము నన్ను చూస్తున్నట్లు కనబడేది. నేనుకూడా ఒకరోజు పరకాయించి అటుకేసి చూచాను. ఆముఖము నవ్వుతూ ఉన్నట్లు నాకుతోచింది. సరే రోజూ అలాగే షికారు వచ్చేవాణ్ణి, అలాగే ముఖము కనబడేది, అలాగే పరకాయించి చూచేవాణ్ణి, అలాగే నవ్వుతూ ఉండేది. ఇల్లా కొన్నాళ్లు గడచినవి. రోజుకు రోజుకు ఆనవ్వు ఆదోవిధముగా మారిపోతున్నట్లు నాకు తోచింది. ఏమిబుద్ధి పుట్టిందో ఒకరోజున దిగకుండా బండిమీదే కూర్చొని కొంచెముసేపు ఆవైపు చూస్తున్నాను. నాకేసి చూస్తూ ఆముఖము-ఆ అందమైన ముఖము-నవ్వుతూ ఆ కిటికీలోనే ఉన్నది. తల్లో పూలదండ, చెవులకు వజ్రపుపోళ్ల దుద్దులూ, వంకపాపిడీ, కళ్లలో, ముఖానా చిరునవ్వూ, ఆనవ్వులో ఒక విధమైన శృంగారమూ, ఇవన్నీ చూచేటప్పటికే నా మనసు మనసులో లేదు. ఏమి చేయడానికీ తోచలేదు. అలాగే చూస్తూ కూర్చున్నాను. ఇంతలోనే ఆకిటికీలోనుంచి దోసెడు సంపెంగపూలు వచ్చి నాబండిలో పడ్డవి. నేను ఆశ్చర్యపోయి ఆపూవులు ఏరుకోవడానికి వంగాను. ఏరుతూ ఏరుతూ కిటికీ వైపు చూచాను. అక్కడ ఎవరూ లేరు. పూవులన్నీ ఏరి చేతులో పట్టుకొన్నాను. ఇంతలోనే ఎవరో చల్లగా నన్ను ముట్టుకొన్నారు. నేను తల ఎత్తి చూచాను. ఆశ్చర్యము! ఆకిటికీలోని చందమా



మే; ఆ అందమైన పడుచుపిల్లే; నవ్వుతూ నా చెయి పట్టుకున్నది.

ఆవేళ శుక్లచతుర్దశి. లేత లేత వెన్నెల ఆసిటాంగునదీ జలముమీాద 'బుకుమలు' తెరలాగున పడి ఉన్నది. అది సౌందర్య లక్ష్మి మేలి ముసుగులా గున్నది. చల్లని పిల్లగాలులు జోకొట్టు తున్నట్లు మేనికిసోకుతూ వీస్తున్నవి. నేను ఈవేళ కూర్చున్న వంతెన అప్పటి కింకా కట్టలేదు. రేవులో చిన్న చిన్న పడవ లెన్నో ఉన్నవి. టేకు పలకలను తెప్ప కట్టి ఆనది మీాదనే దేశదేశాలకు తీసుకొని వెళ్లుతారు. అటువంటి తెప్పలు రేవుపొడుగున ఉన్నవి. ఆతెప్పలమీాదనే చిన్నిచిన్ని గుడిసెలు వేసుకొని తెప్పలవాళ్లు నివసిస్తుంటారు. వాళ్లు ఎంతో చక్కగా పిల్లనగ్రోవి ఊదుతున్నా రావేళ.

ఆయువతి నాచేయి పట్టుకొని ఆనదివైపు తీసుకొని వెళ్లింది. నేను మాట్లాడలేకపోయాను. మంత్రముగ్ధుడిలాగున ఆమె తీసుకొని వెళ్లినట్లల్లా వెళ్లాను. నదీతీరాన ఒక తెప్పమీాద కూర్చున్నాము "నీపేరేమిటి?" అని నే నడిగాను. "సాలోయా! సాలోయానే (సంపెగ) ఇప్పుడు నీపదార్పణ చేశాను."

తర్వాత ఎన్నో మాట్లాడినాము. అవన్నీ యిప్పుడు చెప్పి లాభములేదు. చాలాసే పైన తర్వాత నేను ఇంటికి బయలుదేరాను. నా బండి ఆకిటికీదగ్గరే వున్నది. ఆమే, నేనూ అక్కడికి వచ్చాము. నేను బండి యెక్కాను. అప్పుడు సాలోయా నాచేయి మెల్లిగా నొక్కుతూ, "నీభార్య యెక్కడున్నది?" అని అడిగింది. నే నొక నిట్టూర్పు విడిచి, తణుకు బెణుకు లేకుండా, "నాకింకా పెండ్లి కాలేదు." అన్నాను. నాగుండెలు కొంచెము కొట్టుకోకపోలేదు.

మరునాడు నాబండి సాలోయా ఇంటిదగ్గిరకి వచ్చింది. ఆమె ఆకిటికీలోనే ఉన్నది. నన్ను చూచి పరుగెత్తుకొని వచ్చి నవ్వుతూ బండి ఎక్కి నాపక్కనే కూర్చున్నది. నేను నవ్వుతూ ఆమెకేసి చూచాను.

"సరోవరము దగ్గరికి వెళ్లుదాము" అన్నదామె.

బండి వెనుకకు మళ్లింది. రోడ్డుమలుపు తిరిగి సరోవరానికి వెళ్లాలి. బండి మలుపు తిరిగి రోడ్డెక్కింది. అబ్బా! గుఱ్ఱాలు ఎంత గబగబా నడిచినవి!

ఇంగ్లీషు ప్రభుత్వము రావడానికి చాలా పూర్వము ఆసరోవరము పక్కనే వుండేది రాచనగరు. ఇప్పుడు దానితాలూకు ప్రహారీ గోడమాత్రమే ఉన్నది. ఆగోడమీాదా, పక్కనా, మంచి గంధపుచెట్లూ, కర్పూరపుచెట్లూ, ఇంకా ఏవేవో పలురకాలచెట్లూ దట్టముగా ఉన్నవి. ఆసరోవరానికి తూర్పువైపున 'పెగోడా' ఉన్నది. దాని బంగారుశిఖరమూ, ఆశిఖరము చుట్టూ ఉన్న బంగారుగంటలూ, ఆచరమసంధ్యాకాంతిలో తళతళ మెరిసిపోతున్నవి. ఆగంటలు గాలికి మెల్లగా కదలుతూ అతిమనోహరముగా, మధురముగా మోగుతున్నవి. ఆ సరోవరములో ఈదుతూ ఉన్న పెంపుడుహంసలను పట్టుకొని చీనావాళ్లు ఇండ్లకు వెళ్లిపోతున్నారు. సందెచీకటి పడీపడకమునుపే వున్న

మవెన్నెల వచ్చి స్వచ్ఛమైన ఆసరోవర జలము మీద వాలింది. నవ్వుతూ నీటిమీద తేలి ఆడుతున్న ఆవెన్నెల్లో ఆసరోవరము ప్రశాంతముగా ఉన్నది. పిల్లగాలికి అప్పుడప్పుడు చిన్ని చిన్ని తరంగాలు లేచి కూనిరాగాలు తీస్తూ వెన్నెలను కౌగిలించుకుంటున్నవి.

నేనూ, సాలోయా ఒకచిన్నబోటుమీద ఎక్కి నడిసరోవరానికి వెళ్లాము. తర్వాత బోటును గాలికి వదిలిపెట్టాము. నెత్తిమీద నిండుజాబిల్లి; కింద అద్దములాటి సరోవరము; చుట్టు దడిగట్టినట్లున్న చెట్లూ; సరోవరములో ప్రతిఫలించిన వాటినీడలూ. ఆసౌందర్యము నిజముగా—

ఇక కథ ఏమి చెప్పను? సాలోయా నాయిలవేల్పయింది. నాయింటికి వచ్చి పెత్తనము వహించింది. నాదగ్గర వంట చేయడానికి ఒక తురక ఉన్నాడు. సాలోయా మాటప్రకారము ఆతురకవాడికి సెలవు చెప్పి ఒక బర్మావాడిని వంటకు పెట్టాము. ఈబర్మావాడు సాలోయా చుట్టము.

ఇక ఈవైపునుంచి నాభార్య మాటిమాటికి వస్తున్నానని జాబులు వ్రాయడము మొదలుపెట్టింది. నాచేతనైనన్నాళ్లు ఏవో లేనిపోని సాకులు చెప్పి ఆమెను రాకుండా ఆపాను. చివరకు నామాట పాటించకుండా ఇక్కడికి రావడానికి ఆమె బయలుదేరింది.

స్టీమరు దిగి రైలుమీద ఆమె టంగూ నగరము వచ్చింది. నేను 'స్టేషను'కు వెళ్లి ఆమెను కలుసుకొన్నాను. బండి ఎక్కిన తర్వాత నే నామెతో నాదురవస్థ అంతా పూచా తప్పకుండా చెప్పాను. ఆమె ఏడ్పు మొదలు పెట్టింది.

"మీరు ఏదోవిధముగా ఇక్కడ సుఖముగా ఉన్నారని తెలిస్తే నే నస లిక్కడికి బయలుదేరకనే పోదును. మీరు దేశముకాని దేశములో ఏమి కష్టపడుతున్నారో అని వెట్టిదానిలాగు పడిపోయినట్లు పరుగెత్తుకొని వచ్చాను. సరే! ఏమైనా కానీయండి! ఇప్పుడే తిరిగి నన్ను ఇంటికి పంపించినా సరే. లేకపోతే వేరే ఏదైనా ఇల్లు మాట్లాడి నన్నక్కడ ఉంచినా సరే. నేను ఆమనిషి ఉన్న ఇంటికి రాను." అన్నది నాభార్య.

నే నేమీ మాట్లాడలేదు. బండివచ్చి ఇంటివాకిట్లో ఆగింది. నేను ఆమెకళ్లు తుడిచాను. ఆమె బండి దిగింది.

ఆరునెలలపాటు ఏదో ఒకమాదిరి గడిచింది. తెరవెనక ఏమిగందరగోళము జరుగుతున్నదో నేను ఎరగనే ఎరగను. క్రమముగా సంగతి సందర్భాలన్నీ నాకు తెలియవచ్చినవి. ఇక నాయాట సాగదనుకొన్నాను. నేను తెచ్చే డబ్బంతా సాలోయాచేతిలోనే ఉండేది. కొత్త వంటవాడు తనయిష్టము వచ్చినట్లు ఖర్చు చేసేవాడు. నాతో చెప్పేవాడే కాడు. ఇది ఇల్లా ఉండగా, వీ ళ్లిద్దరూ కలసి నాభార్యమీద ఏమి దౌర్జన్యము చేస్తున్నారో అదికూడా చూచాయగా నాకు తెలిసింది.

నే నొకరోజున సాలోయాతో "ఒంట్లో ఆరోగ్యము సరిగా లేదు. మాదేశము తిరిగి వెళ్లుతాను." అన్నాను.

"నన్ను కూడా నీవెంట తీసుకొని వెళ్లు."

"ఎల్లా వీలవుతుం దది ?"

"అయితే నీ పెళ్లాన్ని ఇక్కడ అట్టే పెట్టి వెళ్లు."

"అది వీలు కాదు."

"ఎందుకు వీలుకాదు? ఆమె ఇక్కడ ఉండటానికే సంబరపడుతుం దనుకుంటాను." అని హేళనగా నాకేసి చూసింది సాలోయా.

"ఏమి టామాట?" అని నేను కొంచెము కోపముతో గద్దించాను.

"నీవేమో గట్టికబుర్లు చెప్పుతున్నావు! నీభార్య ఇప్పుడు కడుపుతో ఉన్నది. నేను గట్టిగా తలుచుకున్నానంటే నీభార్యను కూనీ చేయగలను. కాకపోతే చేయించగలను. ఇది ఆవిషయములో ఆరితేరినచేయి. తెలిసిందా?"

నాకు మాట్లాడడానికి నోరు రాలేదు. ఇది జరిగి రెండునెల లయింది. ఈ రెణ్ణెల్లు కూడా నేను టంగూనగరము చుట్టుపట్ల గ్రామాదులలోనే తిరుగుతూ ఉన్నాను. నేను టంగూనగరము వచ్చిననాడే నాభార్య నొప్పులుపడి ఒక ఆడపిల్లను కన్నది. ఆవేళ ఒక బౌద్ధసన్యాసి మాయింటికి వచ్చాడు. నేను సంతానము కలిగిందనే సంతోషముతో ఆవచ్చిన సన్యాసిని ఎంతో గౌరవముచేసి ఆతిథ్యమిచ్చాను. ఆబౌద్ధసన్యాసి నాతో "నాయనా, సంతానము గలిగిందని ఆనందము వద్దు. ఈ సంసారము అనిత్యము. ఈ భార్యా పుత్రులు అనిత్యము. మాయ, మోహము-అన్నీ అనిత్యమే" అన్నాడు. అతడు మాట్లాడుతున్నంతసేపూ "అనిత్యము" అనేమాటతప్ప మరొకటి మాట్లాడలేదు. స్ఫుటమైన ఉచ్చారణలేక ఆమాటనే 'అనితం' అనేవాడు. అతడు వెళ్లిపోయిన తర్వాత నేను నాభార్యతో "మన చిట్టికి 'అనితమ్మ' అని పేరుపెడదాము" అన్నాను. నాభార్యకూడా సరే అన్నది."

సన్యాసి ఈమాట అనగానే నాభార్య అతనికాళ్లమీద పడి, "నాన్నా, నేనే నీ అనితమ్మను" అన్నది.

సన్యాసి "అవును నిజమే నమ్మా! నీవు సరిగా మీ అమ్మపోలికే. కన్నూ ముక్కూ తీరు, మాటా, గొంతూ, సరిగా ఇచ్చి పుచ్చుకొన్నట్లు మీ అమ్మమాదిరే. తర్వాత కథ వినండి. కథంతా సరిగా పూసగుచ్చినట్లు చెప్పలేను. నేను ఒకరోజున టంగూనగరానికి ఇరవైమైళ్ల దూరములో ఉన్న ఒక ఊరి 'ట్రావెలర్సు బంగాళా'లో ఉన్నాను. అప్పటికి సాయంకాలము కావచ్చింది. హఠాత్తుగా సాలోయా అక్కడికి ఊడిపడ్డది. కారణ మేమిటో నాకు తెలియలేదు. నే నడిగాను. ఎన్నిసారులడిగినా "నిన్ను చూడకుండా ఉండలేక పోయాను. అందుకే వచ్చాను." అనేమాటనే రకరకాల భావాలతో, ఎన్నో విధాల తెలిపింది. చివరకు ఆమాటా ఈమాటా అయిన

తర్వాత నాతో “ నామాట నీవు నమ్మవు. నేను రోజూ కళ్లారా చూస్తున్నాను నీభార్య సంగతి. నా వెంట నీవు వస్తే ఈవేళ నీకు కూడా ప్రత్యక్షముగా చూపిస్తాను” అన్నది.

నేనామెమాట అణుమాత్రమూ నమ్మలేదు. కాని ఒక సారదేమిటో చూడాలని మాత్రము మనసుపుట్టింది. ఆ మరునాడు రెండుజాముల వేళకు మోటారుమీద టంగూ నగరము వచ్చాము. మాయింటికి వచ్చి చూచేటప్పటికి తలుపు లోపల గొళ్లెము వేసి ఉన్నది. సాలోయా చిత్రముగా ఎల్లాగో బయటినుంచే లోపలిగొళ్లెము తీసింది. ఏమున్నది లోపల ? చంటిబిడ్డతో నాభార్య పడుకున్నది. ఆపక్క మీదనే ఒకవైపునవంటవాడు పడుకున్నాడు. నాభార్య గాఢనిద్రలో ఉన్నది. నాతల తిరిగిపోయింది. ప్రపంచము తలక్రిందు లైపోయినట్లు తోచింది. వెంటనే ఈపన్నాగ మంతా సాలోయా పన్నిం దని మెరుపు మెరిసినట్లు నామనసున తోచింది. వంటవాడు మేలుకొనే ఉన్నాడు. మే మింట్లోకి రావడము చూసి వాడు మెల్లగా నాభార్యమీద చేయి వేయబోయాడు. నాకు ఒళ్లు మండింది. ‘కబడ్దార్’ అని ఒక కేకవేసి నేను ఆగదిలోనే ఒకమూల వేలాడుతూఉన్న కత్తి తీసుకొన్నాను. నావంట వాడు నాముందే నాభార్యను అవమాన పరుస్తున్నాడని నాకెక్కడలేని కోపము వచ్చింది. చేతికొద్దీ కత్తి విసరివేశాను. ఆదెబ్బ భుజము దూసుకొనిపోయి తలకు తగిలింది. తెలివి దప్పి క్రింద పడిపోయాడు వాడు. ఇంటినిండా నెత్తురు. మహాభయంకరముగా ఉన్నది. సాలోయా కేకలు వేస్తూ వెళ్లి ఆవంటవాడిని కౌగిలించుకొని ఏడ్పు మొదలు పెట్టింది. ఈగందరగోళముతో, నాభార్య లేచి చూచి, గబగబా వచ్చి నాచేతిలో కత్తి లాగి ఒకపెట్టెలో పెట్టి తాళము వేసింది. జరిగిన సంగతి ఆమెకు తెలియదు. ఇంకొక మోస్తరుగా యోచించి ఆమె నాదగ్గఱకి వచ్చి విసనకర్రతో విసరుతూ, “ నేను ఇన్నాళ్లదాకా ఈసాలోయా సంగతి మీకు చెప్పలేదు. ఈవేళ గ్రహచారము చాలక మీకంట బడ్డది. ఏమిటి ఈ గందరగోళము ? ఈ కొంపమునక ఎందుకు వచ్చింది?” అన్నది. అసలుసంగతి ఆమె ఊహించను కూడా ఊహించ లేక పోయింది. ఆ అమాయకు రాలిని నేనేమనను ?



“‘కబడ్దార్’అని ఒక కేకవేసి......కత్తి తీసుకొన్నాను.”

సరే; వంటవాడు ఆసుపత్రికి వెళ్లాడు. నేను జయిలుకు వెళ్లాను. అసలుసంగతి బయటబడ్డది. వంటవాడికి సాలోయా ప్రియురాలు. వాళ్లిద్దరి ఖర్చులూ భరించడానికి నేనొక సాధనాన్ని మాత్రమే. ప్రతిరోజూ నాభార్య ఈ సంగతి కళ్లార చూస్తూ వింటూకూడా, నామనసు బాధపడుతుందని నాతో చెప్పలేదు. ప్రతిక్షణము వేయితేళ్లు కుట్టినట్లు ఆమెమనస్సు బాధపడుతూ ఉన్నప్పటికీ ఈవిషాన్ని ఏలాగున సహించిందో ఎవరు చెప్పగలరు?"

సన్న్యాసి మరి మాటాడలేదు. నేలచూపు చూస్తూ, కిందపడిఉన్న ఏకతార తీగ రెండుసారులు వేలితో మీటాడు. నాభార్య వెక్కివెక్కి ఏడుస్తున్నది. అదిచూచి సన్యాసి మళ్లా "చూడు తల్లీ! ఏడవకమ్మా! అనితా! నాకేసు విచారణకు వచ్చింది. నాతరఫున పెద్దపెద్ద అడ్వకేటులు పనిచేశారు. చివరకు నాకు ఏడేండ్లు కఠినశిక్ష పడింది. జయిలులో సంగతు లెందుకు చెప్పడము? శిక్షపూర్తికాగానే జయిలులోనుంచి సరాసరి ఈయింటికి వచ్చాను. వంటవాడూ, సాలోయా భార్యాభర్తలులాగున ఇక్కడే కాపురముంటున్నారు. నన్ను చూసి వంటవాడు వెఱ్ఱినవ్వునవ్వుతూ, "మళ్లానన్ను చంపడానికి వచ్చావా? నాతోటలోని ఈసాలోయా సుమాన్ని మళ్లా కొంచెము వాసనచూస్తావా?" అన్నాడు.

'చూడను.' అన్నాను నేను.

సాలోయా నవ్వుతూ "మాకాపరాన్ని గంగలో కలుపుతావా?" అన్నది. నేను అడ్డముగా తలవూపి "నాభార్య ఎక్కడ!" అని అడిగాను.

"ఈ 'బర్మాభర్త' దొరకలేదని ఆత్మహత్య చేసుకొన్నది."

ఆమాట నాకేమీ ఆశ్చర్యము వేయలేదు. "మాఅమ్మాయి యేది?" అని నేను మళ్లా అడిగాను.

"రంగూనులో అమ్మేసి వచ్చాము."

నేను మరిమాటాడ లేదు. అక్కడనుంచి వచ్చేశాను. తర్వాత ఆపిల్లకోసము చాలా వెదికాను. కాని ప్రయత్నాలన్నీ వ్యర్థమైపోయినవి." అని తనకథ ముగించాడు.

అప్పుడు నాభార్య "ఎల్లా కనబడతాము మరి? నన్ను తీసుకొని మాఅమ్మ తాతగారింటికి వెళ్లింది. మామామయ్యను అనంతపురము బదిలీచేశారు. మేము మామయ్య వెంట అక్కడికి వెళ్లిపోయాము" అన్నది.


తర్వాత సన్యాసి "అంతా అయిపోయింది. ఈ ప్రపంచమంతా మిథ్య-అనిత్యము. ఈ మాటే నాకు నచ్చింది. దీన్ని అనుభవములో పెట్టడమునకూ, నాకడుపుమంట చల్లారడమునకూ, ముక్తి సంపాదించడమునకూ, బౌద్ధమత మవలంబించాను. కొన్నాళ్లకు సన్న్యసము పుచ్చుకొన్నాను. తర్వాత ఈనగరములో ఉన్న 'సుఖాతాపెగోడా'లో కొన్నాళ్లు, రంగూనులో ఉన్న 'సౌడేలాపెగోడా'లో కొన్నాళ్లు కాలము గడిపాను. తర్వాత అక్కడా, అక్కడా, తిరిగి తిరిగి మళ్లీ ఏడేండ్లకు ఈనగరము వచ్చాను." అన్నాడు.

నాభార్య మళ్లీ, "నాన్నా! మాఅమ్మ తాతగారింట్లో ఉన్నన్నాళ్లు చేతిగాజులు చిట్లించలేదు. రెండుపూటలూ ముఖాన పసుపు రాచుకొని కుంకుమబొట్టు పెట్టుకొనేది. అంతే కాని ఒకపండుగనీ, పబ్బమనీ, ఒకసంతోషమనీ, సంబరమనీ ఏమీ ఉండేదికాదు. ఎప్పుడూ ఉపవాసాలతో ఉండేది. ఎప్పుడూ ఆమె ముఖాన చిరునవ్వు చూడలేదు నేను. పొద్దస్తమానమూ ఏడుస్తూ ఉండేది. ఎవరైనా నీసంగతి తలపెట్టితే 'ఎక్కడున్నారో ఏమీ తెలియదు.' అని చెప్పేది. నామట్టుకు నాకు కూడా ఈసంగతి చెప్పలేదు. అప్పుడప్పుడు మాత్రము 'నీపెళ్లి అయిన తర్వాతనే నొకసారి బర్మా వెళ్లిరావాలి' అనేది. ఇక్కడ వకాల్తీ చేయమని బలవంతపెట్టి ఈయనగారిని ఆమె తీసుకొని వచ్చింది. మీ రెప్పటికైనా తప్పక కనబడతారని, మీ కాళ్ల దగ్గరే తనప్రాణాలు విడవవచ్చునని, ఆమె అనుకొన్నది కాబోలు. పాపము! ఆమె ఉద్దేశము ఇప్పుడు తెలుస్తున్నది. చివరకు ఆమె కోరిక నెరవేరనే లేదు. ఆమె చనిపోయి ఈ వేళకు పదహారు. ఒక్క పదిహేనురోజులు ముందుగా వచ్చి ఉంటే నీవు, ఆయిల్లాలి ఆత్మ ఎంత సంతోషించేదో!" అన్నది.

ఈమాట విని సన్యాసి ఒకవెఱ్ఱికేక వేశాడు. ఊఱుమైనా అంత భయంకరముగా ఉండదనుకొంటాను. నాకప్పటికి రెండేండ్ల కొడుకు. అంతవరకు వాడు దాదిదగ్గర నిద్రపోతున్నాడు. ఈసన్యాసి కేకతో నిద్రలేచి వాడు కాళ్లూ చేతులూ విదిలిస్తూ, 'అమ్మా అమ్మా' అని ఏడుపు మొదలుపెట్టాడు. నేనుకూడా వాడివైపే చూస్తూ ఉన్నాను. నాభార్య వాడిని ఎత్తుకొని ఓదార్చి సన్యాసివైపు వేలు చూపిస్తూ, "అడుగో తాతయ్య, చూడు." అన్నది.

'తాతా తాతా' అంటూ కుఱ్ఱవాడు చప్పట్లు కొట్టుకుంటూ సన్యాసి దగ్గరికి వచ్చాడు. సన్యాసి లేచి నిలుచున్నాడు. నాభార్య ఏడుస్తూ అతని కాళ్లుపట్టుకొని, "లేని అమ్మ లేనేలేదు. ఇన్నాళ్లకు నీవు కనబడ్డావు. నిన్ను నేను పోనియ్యను. నీవు ఇక్కడే ఉండాలి" అన్నది. "నేను సన్యాసిని. మాకు సుఖదుఃఖాలుగాని, బంధాలుగాని లేవు. ఈ ప్రపంచమంతా మిథ్య."


"ఆ మాట లేమీ పనికిరావు."




'హా' అని సన్యాసి మళ్లా కేకవేశాడు. చంటికుఱ్ఱవాడు భయపడి కేరుమన్నాడు. నా

భార్య వాడిని ఎత్తుకొని ముద్దుబెట్టుకొని ఓ దార్చడానికి నాలుగడుగులు వేసింది. ఈలోపల సన్యాసి బయటికి వెళ్లాడు. ఫెళఫెళా ఉఱిమింది. 'హాహా' అనే సన్యాసి అఱపుకూడా ఆ ఉఱుములో కలసిపోయింది. ఆచీకట్లో, ఆకుంభవర్షములో, ఆ ఈదురుగాలిలో 'హాహా' అనే ధ్వనితప్ప మరి సన్యాసి కనబడలేదు. ఎంత పిలిచినా ఈదురుగాలి 'రంయ్యి'తప్ప మరేమీ వినబడలేదు. తర్వాత కూడా - అతనికోసము వెదకాను. అయితే లాభ మేమిటి?

---




తండ్రి—వెధవా! ఎప్పుడురా నీ చేతుల కింత మసి అంటుకుంది.

కుమారుడు—మొఖం కడుక్కుంటప్పుడు—

---